నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
బుధవారం | 29 జనవరి 2025 | పేజీలు 8





- ఫిబ్రవరి 1న ఇళ్ల పంపిణీ
- పాల్గొననున్న మంత్రులు ప్రజాప్రతినిధులు
- పందిపాడులో హాజరుకానున్న మంత్రి టీజీ భరత్
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాష

### పింఛన్లతో పాటు

# లబ్ధిదారులకు ఇల్లు

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఫిబ్రవరి ఒకటవ తేదీన రాష్ట్రంలో లక్ష ఇళ్ల నిర్మాణాలను లబ్దిదారులకు అందించడంలో భాగంగా జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంకాలం ఇళ్ళ నిర్మాణాలను లబ్దిదారులకు అందించే కార్యక్రమ నిర్వహణపై ఎంపిడిఓలతో, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయడంతో పాటు, రాష్ట్రంలోలక్ష ఇళ్ల నిర్మాణాలలో భాగంగా జిల్లాలో పూర్తయిన

మిగతా 2లో

## వలసలు ఆపండి

- విద్యార్థులు వెళ్లకుండా చూడండి
- ఉపాధి హామీ అమలు తీరు పై అసంతృప్తి
- పనితీరు మెరుగుపడకపోతే కఠినచర్యలు తప్పవని హెచ్చరిక
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో**

కర్నూలు జిల్లాలో వలసల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ పనులు, వలసల నివారణపై అధికారులతో

మిగతా 2లో

- తట్టాబుట్టా పట్టుకొని పని కోసం తరలిపోతున్న కూలీల కుటుంబాలు
- కూలీలు దొరకక విలవిలలాడుతున్న రైతన్నలు
- ఉపాధి హామీ అమలులో వెనుకబాటు
- నిరుటితో పోలిస్తే ఈ ఏడు తగ్గిన ఉపాధి మామీ పనులు
- ప్రభుత్వ సిబ్బంది పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్
- ఉపాధి హామీ కూలీతో పోలిస్తే అక్కడ రెట్టింపు డబ్బు వస్తోందంటున్న కూలీలు



# జిల్లా నుండి ఆగని వలసలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :**

కర్నూలు జిల్లా నుండి రైతుకూలీల వలసలు కొనసాగుతున్నాయి. గ్రామాల నుండి వందలాది మంది వలస పోతున్నారు. ఆలూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల నుండి కుటుంబాలకు కుటుంబాలు 'సుగ్గి'కి వెళ్లిపోతున్నాయి. సంక్రాంతి పండుగకు గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం అవుతున్నారు. వలసల నివారణకు అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకోలేకపోతోంది. ఉపాధి హామీ పథకం ఉత్తుత్తిగా మారింది. మంగళవారం ఉపాధి హామీ, వలసల నివారణపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నిర్వహించిన సమీక్ష లక్ష్య సాధనలో అధికార యంత్రాంగం ఎంత నిర్లిప్తంగా ఉందన్నది స్పష్టం చేసింది. రైతు కూలీలు వలస వెళ్లకుండా చూడడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. స్థానికంగానే పని కల్పిస్తామన్న హామీ ఇవ్వలేకపోతోంది. రైతు కూలీల వలసలు రైతులకు శాపంగా మారుతున్నాయి. పశ్చిమ ప్రాంతంలో రైతులు వ్యవసాయ కూలీలు అందుబాటులో లేక నానా కష్టాలు పడుతున్నారు. కోతకొచ్చిన పంటను కోసేవారు లేక రైతన్నలు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయ కూలీల వలసలతో గ్రామాలకు గ్రామాలు బోసిపోతోంటే పొలాల్లోని పంటను ఇంటికి తరలించుకునే పరిస్థితి లేక రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు..

నిరుడు ఇదే సమయానికి కర్నూలు జిల్లాలో 88 వేల మందికి ఉపాధి పనులు కల్పిస్తే ఈ ఏడాది కేవలం 53వేల మందికి పనులు కల్పించగలిగారు. ఆలూరు, చిప్పగిరి, దేవనకొండ,కోడుమూరు,ఎమ్మిగనూరు, కల్లూరు, మంత్రాలయం,

మిగతా 2లో





వాహనాల పై గ్రామాలలో వలసలు వెళ్లుతున్న వ్యవసాయ కూలీలు( ఫైల్‌ఫోటో)

## సిలిండర్ పేలిన దుర్ఘటనలో ఇద్దరు మృతి

2లో

చాపిరేవులలో జరిగిన దుర్ఘటన



శిథిలాల కింద మృతి చెందిన బాలుడు

చాపిరేవుల గ్రామంలో సిలిండర్ పేలిన ధాటికి కుప్పకూలిన ఇళ్లు

### ఉన్నత ప్రమాణాలతో

## ఉర్దూ యూనివర్సిటీ

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు మాహమ్మద్ అహమ్మద్ షరీఫ్

6లో



ఏపి సలహాదారుడికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్ న్యూస్ బ్యూరో :** కర్నూలు ఉర్దూ యూనివర్సిటీని ఉన్నత ప్రమాణాలతో నిర్మాణం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ విభాగం సలహాదారుడు మహమ్మద్ అహమ్మద్ షరీఫ్ తెలిపారు.మంగళవారం యూనివర్సిటీలో

మిగతా 2లో

### ఓవర్ బ్రిడ్జి హైట్

## పెంచుతారా..?

7లో



చిన్నదిగా నిర్మిస్తున్న అండర్ పాస్ వంతెన ఇదే

- సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తారా..?
- ఈ దారి నుండి 26 గ్రామాలకు రాకపోకలు ..
- నేషనల్ హైవే అండర్ బ్రిడ్జి ఎత్తును పెంచాలని ప్రజల,నాయకుల డిమాండ్
- పలుమార్లు జిల్లా అధికారులకు వినతి పత్రాలు
- సమస్య తీరకపోవడంతో పనులను అడ్డు చెబుతున్న నాయకులు, ప్రజలు

### 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా

## భారతదేశాన్ని నిలబెట్టాలి

- ఏపినీ అగ్రభాగాన నిలబెట్టాలని కూటమి నిర్ణయం
- 20 సూత్రాల అమలు పై సుదీర్ఘ సమీక్ష
- ఏపిలో నంద్యాల జిల్లా నుంచే అభివృద్ధి పనులకు శ్రీకారం
- మీడియాతో 20 సూత్రాల చైర్మెన్ లంకా దినకర్

2లో



సమావేశంలో మాట్లాడుతున్న లంకా దినకర్

సూర్య



## పింఛన్లతో పాటు లబ్ధిదారులకు ఇల్లు

(మొదటి పేజి తరువాయి)

ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పందిపాడు గ్రామంలో మంత్రి ప్రారంభించనున్నారని కలెక్టర్ తెలిపారు.ప్రతి నియోజకవర్గంలో, ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.లబ్ధిదారులు ఎక్కువగా ఉన్న చోట కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించడం తో పాటు పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, లబ్దిదారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో హాజరయ్యే విధంగా ఆహ్వానించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంతో పాటు ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం సబ్ కలెక్టర్, ఆర్డీవో లకు కార్యక్రమ నిర్వహణపై సూచనలు ఇచ్చారు.టెలి కాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూల్ ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వలసలు ఆపండి

(మొదటి పేజి తరువాయి)

ఆయన మాట్లాడారు. పశ్చిమ ప్రాంతం నుండి రైతుకూలీలు వలసలు వెళుతున్నట్లు నిత్యం పత్రికల్లో కథనాలు వస్తున్నా వలసలను ఎందుకు ఆపలేకపోతున్నారంటూ అధికారుల పని తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలకు వెళ్లి క్యాంపులు నిర్వహించాలని, ప్రజలకు పనులు కల్పిస్తామన్న భరోసా ఇవ్వాలని, పిల్లల చదువుకు భంగం కలగకుండా తల్లిదండ్రులను వలస వెళ్లకుండా ఒప్పించాలని ఆయన సూచించారు. ఇప్పటికే వలస వెళ్లిన ప్రాంతాల్లో అవసరమైన చోట సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని, ఇందుకు తగిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆయన చెప్పారు. గతేడాది ఇదే సమయానికి 88వేల పని దినాలు కల్పిస్తే ఈ ఏడు కేవలం 53వేల మందికే పనులు కల్పించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 31వ తేదీలోగా పురోగతి సాధించాలని, అలాగే ఫిబ్రవరి 15వ తేదీ నాటికి లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ఆలూరు, చిప్పగిరి, దేవనకొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, కల్లూరు, మంత్రాలయం, కౌతాళం, పెద్దకడుబూరు, హోళగుంద, పత్తికొండ, వెల్దుర్తి, ఆస్పరి, సి.బెళగల్ మండలాల్లో ఉపాధి హామీ పనుల కల్పనలో ఎందుకు వెనుక బడుతున్నారని ఆయన ప్రశ్నించారు. వలసలు వెళుతున్న గ్రామాలకు బృందాలుగా వెళ్లి వలసలు వద్దని, ఇక్కడే పనులు చూపిస్తామన్న భరోసా ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాలకు వెళ్లి రైతుకూలీలను కలిసి వారిలో భరోసా నింపేందుకు తీసుకున్న చర్యలను ఫోటోలతో తనకు సమర్పించాలని ఆయన ఆదేశించారు. గోకులాల నిర్మాణాలు ఇప్పటి వరకు 471 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదోని మండలం గోకులాల నిర్మాణంలో వెనుకబడి ఉందని, పురోగతి సాధించాలని ఎంపిడిఓను కలెక్టర్ ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి వెంకటరమణయ్య, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఏపిడిలు, ఏపిఓలు పాల్గొన్నారు.

## సిలిండర్ పేలిన ఘటనలో రెండు గుడిసెలు దగ్ధం



దగ్ధమైన గుడిసెలు దృశ్యం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** గ్యాస్ సిలిండర్ పేలి రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమైన ఘటన ఆదోని పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని స్థానిక గోకర్ జెండా వీధిలో (ఉర్దూ స్కూల్ వెనకాల) మంగళవారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. సిలిండర్ పెద్ద శబ్దంతో పేలడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం వల్ల అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం తరపున తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# జిల్లా నుండి ఆగని వలసలు

(మొదటి పేజి తరువాయి)

కౌతాళం, పెద్దకడబూరు, హోళగుంద, పత్తికొండ, వెల్దుర్తి, ఆస్పరి, సి.బెళగల్ మండలాల్లో కూలీలకు అవసరమైన పనులు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్నది రికార్డులు చెబుతున్న మాట. ఇప్పటికే ఆయా మండలాల్లో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యాయన్నది నిష్ఠురసత్యం. వృద్ధులను ఇళ్ల వద్దే వదిలేసి ఇతర ప్రాంతాలకు పనులుకు వెళ్లిపోయారు. కొన్ని గ్రామాల్లో కేవలం వృద్ధులు మాత్రమే కనిపిస్తున్న దారుణ దృశ్యాలు పశ్చిమ ప్రాంతంలో కనిపిస్తున్నాయి. మరోవైపు వలసల కారణంగా పాఠశాలల్లో హాజరు శాతం గణనీయంగా తగ్గిపోయింది. మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నా పనుల కోసం పిల్లలను కూడా వలస తీసుకు వెళుతున్నారన్నది పాఠశాలల్లో హాజరు శాతం స్పష్టం చేస్తోంది. సీజనల్ వసతి గృహాలు ప్రారంభించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. ప్రతి ఏడు లాగానే ఈ ఏడూ రైతు కూలీలు వలస వెళ్లడం ఖాయమన్న పరిస్థితులున్నా సీజనల్ వసతి గృహాలను ప్రారంభించడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నది వాస్తవం. మంగళవారం నాటి సమీక్షలో వలసలను నివారించడంలో, రైతు కూలీలను వలస వెళ్లకుండా నిలవరించడంలో విఫలమయ్యారంటూ జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేయడం జిల్లాలో వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. రైతు కూలీల వద్దకు వెళ్లి అవసరమైన పని చూపిస్తాం, వలస వెళ్లాల్సిన అవసరం లేదని ఒప్పించేందుకు ఎందుకు ప్రయత్నించరంటూ కలెక్టర్ సంబంధిత ఉద్యోగులను నిలదీశారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి ఉపాధి హామీ పనుల కల్పనలో వందశాతం ప్రగతి సాధించాల్సిందేనంటూ కలెక్టర్ ఖరాఖండీగా ఆదేశించారు.

రైతు కూలీలు స్థానికంగా పనులు చేసేందుకు ఆసక్తికనబరచడం లేదని తెలుస్తోంది. ఇతర ప్రాంతాలకు వెళితే కూలీలు బాగా గిట్టుబాటు అవుతున్నాయన్నది రైతు కూలీల మాటగా ఉంది. బెంగళూరు, విజయవాడ, గుంటూరు, చెన్నై తదితర చోట్ల ఒక్కొక్కరికి 800 నుండి వెయ్యి రూపాయల వరకు కూలీ ఇస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక జంట 1600 రూపాయలు లేదా 2 వేల రూపాయలు రోజుకు సంపాదిస్తోందన్న మాటే. నెల రోజులు పని చేస్తే తక్కువలో తక్కుగా ఒక్కొక్కరికి 30 నుండి 40వేల రూపాయలు ఆదాయం దక్కుతోంది. కనీసం నాలుగు నెలలు బయట పనులు దొరుకుతాయని రైతు కూలీలు చెబుతున్నారు. మళ్లీ వ్యవసాయ సీజన్ ప్రారంభమయ్యే సమయానికి అంటే జూన్ నెలలో తిరిగి తమతమ ప్రాంతాలకు వస్తే వ్యవసాయ పనులు చేసుకోవచ్చని వలసలు పోతున్న వారంటున్నారు. పిల్లలకు బడి పోయినా సరే వ్యవసాయ సీజన్ నాటికి పెట్టుబడులకు డబ్బు దొరుకుతుందని, అలాగే ఏడాది పొడవునా ఆర్థిక కష్టాలు లేకుండా బతుకు బండి గడిచిపోతుందని కూలీలు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనులకు వెళితే గిట్టుబాటు కాదన్నది వారు అంటున్నారు. ఉపాధి హామీ పథక ంలో భాగంగా చేసే పనులతో కొంత కాలం తర్వాత పస్తుండాల్సిందేనంటున్న రైతుకూలీలను ఒప్పించి వలసలు వెళ్లకుండా నివారించడం సాధ్యమవుతుందా? అధికార యంత్రాంగం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సిలిండర్ పేలిన దుర్ఘటనలో ఇరువురు మృతి



సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** వంట చేసే సమయంలో మహిళలు అప్రమత్తంగా లేకపోతే ఇంటిల్లిపాది మూల్యం చెల్లించుకోక తప్పదనే సంఘటన నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో చోటుచేసుకుంది. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఒక ఇంటిలో గ్యాస్ లీకై ఇంట్లోని వారు లైట్ వేయడంతో ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో ఇళ్లు పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలగా మంటలు వ్యాపించాయి. వెంకటమ్మ అనే వృద్ధురాలు, ఆరేళ్ళ చిన్నారి పండు మృత్యుఒడిలోకి చేరుకున్నారు. పేలుడు ధాటికి రెండు ఇళ్ళ పైకప్పు సైతం దెబ్బతిన్నాయి. దీంతో 8మందికి మంటలు వ్యాపించడంతో కాలినగాయాలయ్యాయి. వెంటనే వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చి సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద ఉన్న ఆరేళ్ళ చిన్నారిని అగ్నిమాపక సిబ్బంది బయటకు తీశారు. మరో ఇంటిలో శిథిలాల కింద వెంకటమ్మ మృతదేహాన్ని కూడా వెలికితీశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న శిల్పా నాగినిరెడ్డి

**బాధితులను పరామర్శించిన శిల్పా నాగినిరెడ్డి :** చాపిరేవుల గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలతో పాటు చికిత్స పొందుతున్న వారిని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సతీమణి నాగిని రవి సింగారెడ్డి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యాధికారులతో మాట్లాడి సరైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం జరగడం దురదృష్టకరమని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని హామీనిచ్చారు. బాధితులకు ప్రభుత్వం ఆర్థికంగా సాయం అందించాలని కోరారు. వైయస్సార్ సీపీ నాయకులు మ ఆజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఆదిరెడ్డి, భాస్కరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

# 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశాన్ని నిలబెట్టాలి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**
2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టాలన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్‌గా నిలబెట్టాలన్న ఉద్దేశంతో 20 సూత్రాల అమలుపై సమీక్ష నిర్వహించడం జరిగిందని 20సూత్రాల చైర్మన్ లంకా దినకర్ అన్నారు. మంగళవారం సెంటినరీ హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో రాష్ట్రంలో కూటమి సర్కార్ ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రాన్ని వికసిత్‌లో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంలో భాగంగా సమీక్ష చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన అంశాలు క్షేత్రస్థాయిలో ఏవిధంగా జరుగుతున్నాయని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో రివ్యూ చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో సురక్షిత మంచినీటి అందించడంలో భాగంగా అమృత్ పథకంపై అంశాలు, గ్రామీణ సడక్ యోజన, సహాయక బృందాలను ఏవిధంగా మహిళలను ఏవిధంగా ముందుకు తీసుకుని వెళ్లాలి, గరీబ్ కల్యాణ్, అన్నయోజన ద్వారా పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తుందన్న దానిపై, పీఎం సూర్య ఘర్ ప్రజలకు ఏవిధంగా ఇస్తుందన్న విషయం సమీక్ష చేయడం జరిగిందన్నారు. పేదలకు సొంత ఇళ్లు ఆవాస్‌పై ఏవిధంగా మౌళిక వసతులను గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకం అమలుపై, సదుపాయాలపై అమ లుపై సమీక్ష చేయడం జరిగిందని తెలిపారు. పర్యాటక రంగంలో భాగంగా నవనందులు, నావనరసింహులు, శ్రీశైలం, ఆధ్యాత్మిక క్షేత్రాలను ఒక సమూహంగా అభివృద్ధి చేయాలని సమీక్ష చేయడం జరిగింది. పరిశ్రమల ఏర్పాటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ గత ఐదేళ్లలో మితిమీరిన వ్యయం ఉందన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా వాటికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. వంద పనిదినాల్లో పురోగతి సాధిస్తామని కలెక్టర్ తెలిపారని అన్నారు. రూ.500కోట్ల వ్యయంతో నీటి వనరుల లభ్యతలో భాగంగా దీర్ఘకాలికంగా 5రకాల రిజర్వాయర్ల నుంచి గ్రామాలకు నీటిని ఇవ్వాలని ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. గ్రామీణ సడక్ యోజన కింద 15పనులకు సంబంధించి 12పనులు పూర్తయ్యాయని రూ.87కోట్ల 63లక్షలు అంచనా వ్యయం అయితే రూ.73కోట్ల పనులు ఖర్చు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని స్వయం సహాయక గ్రూపుల నుంచి మహిళలను లక్షాధికారులుగా చేయడానికి ముందుకు వెళ్తున్నట్లు తెలిపపారు. పీఎం ఆవాస్ యోజన కింద 46వేల 626 గృహాలు కేటాయిసేఉ్త 27వేల 126 మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగతా వారు మౌళిక వసతులు లేకపోవడం వల్లనే నివాసం లేరని, పీఎం సూర్యఘర్ ద్వారా విద్యుత్‌ను అందించడం జరుగుతుందన్నారు. టిడ్కో గృహాలలో భాగంగా 11,680 గృహాలు ఉంటే అందులో 5వేల గృహాలు మాత్రమే పూర్తయ్యాయని అందులో 1200మంది మాత్రమే నివాసం ఉంటున్నారన్నారు. దీనికి కారణం అక్కడ మౌళిక వసతులు లేకపోవడమే అన్నారు. పట్టణంలోని ప్రతి ఒక్కరికి సురక్షిత నీటిని ఇవ్వాలని, అమృత్ పథకంకు సంబంధించి డోన్ మున్సిపాలిటీకి అమృత్ 2కింద రూ.23కోట్ల 56లక్షలు, బేతంచెర్లకు రూ.45కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. పీఎం సూర్యఘర్‌లో లబ్ధిపొందిన వారితో వీడియోలు తీయాలని ఆదేశించడం జరిగిందన్నారు. అలాగే అందరికీ ఇళ్లు గురించి, 2019-24మధ్యలో పీఎం ఫసల్ బీమా రైతులకు అందలేదన్నారు. ఆప్రీమియం పూర్తయ్యేలా చూడాలన్నారు. నంద్యాలలో ఉన్న సుప్రసిద్ధ దేవాలయాలను అనుసంధానం చేసి రాయలసీమలోనే ఆధ్యాత్మిక హబ్‌గా తీర్చిదిద్దాలన్న చర్చ జరిగినట్లు తెలిపారు. ఈప్రాంతంలో ఉపాధి ఏవిధంగా పెంచాలనే లక్ష్యాలను నిర్ణయించినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర-2047లో భాగంగా నంద్యాల వికసిత్‌గా ఇక్కడి నుంచే అభివృద్ధి వస్తేనే దానికి తగిన విధంగా ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతో ఉన్నామన్నారు. ఈమీడియా సమావేశంలో కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌లు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడలు

- కళాశాలలో విద్యార్థుల వసతుల రూపకల్పనే లక్ష్యం
- డిఎస్ఏ డా.కరుణా సాగర్



మాట్లాడుతున్న డిఎస్ఏ డా.కరుణా సాగర్

**మహానంది, మేజర్‌న్యూస్ :** ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ యూనివర్సిటీ అనుబంధ సంస్థల్లో చదివే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డా.కరుణా సాగర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహానంది వ్యవసాయ కళాశాలలో జరిగే క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ డిప్లమా కళాశాలల విద్యార్థులకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు మహానంది వ్యవసాయ కళాశాలలో ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. దాదాపు 20 డిప్లమా కళాశాలలకు సంబంధించి 375 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డా.రవికాంత్ రెడ్డి పర్యవేక్షణలో ఈ క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలీబాల్, షెటిల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, చెస్, క్యారమ్స్, టెన్నీకాయిడ్ క్రీడలతో పాటు అథ్లెటిక్స్, లిటరరీ కల్చరల్ ఈవెంట్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

**విద్యార్థుల వసతులకే ప్రాధాన్యత :** ఆచార్య ఎన్‌జి రంగా యూనివర్సిలో చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రతి కళాశాలలో వసతి, తరగతి గదుల కొరత ఉందని వాటిని అదిగమించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. మహానంది వ్యవసాయ కళాశాలలో అంచనాలు వేసి నివేదిక సమర్పించాలని డీన్‌ను ఆదేశించినట్లు తెలిపారు. 70 శాతం అమ్మాయిలే వ్యవసాయ విద్యను అభ్యసించేందుకు వస్తున్నారని వారికి అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రధానంగా బాపట్ల, మహానంది, నైరా కళాశాలల్లో తరగతి, వసతి గదుల కొరత అధికంగా ఉందని గుర్తించామని అన్నారు. ఐకార్ ఆదేశాల మేరకు విద్యార్థులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నారని నియంత్రించేందుకు చర్యలు చేపట్టేందుకు విసి ఆసక్తి చూపుతున్నారని అన్నారు. వీరి వెంట డైరెక్టర్ ఆఫ్ పాలిటెక్నిక్ డా.ఎన్‌సి వెంకటేశ్వర్లు, డీన్ విజయలక్ష్మి, ఓఎస్ఏ డా.ఎల్.విజయ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సెపతక్‌రా జాతీయ పోటీలకు ఎంపికైన కావ్యశ్రీ



**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** 28వ జూ నియర్ సెపతక్‌రా జాతీయ పోటీలకు మండల కేంద్రమైన దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ. కావ్యశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 29వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జిల్లా కేంద్రమైన నంద్యాల రామకృష్ణ పి.జి కళాశాల ఇండోర్ స్టేడియం నందు క్రీడా పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. విద్యార్థినీ కె. కావ్యశ్రీని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేసిన పి.డి దేవేంద్రను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు విద్యార్థినీ తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పి.డి దేవేంద్ర, విద్యార్థినీ కావ్యశ్రీలు పాల్గొన్నారు.

## గ్యాస్ పేలిన బాధితులను పరామర్శించిన జనసేన నాయకులు



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామంలో గ్యాస్ పేలుడు సంఘటనలో మృతి చెందిన, గాయపడిన కుటుంబాలను నంద్యాల జనసేన నాయకులు పిడతల సుధాకర్ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమని, బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట గిరి, నాగేష్, అబి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## టోల్‌గేట్ పునరుద్ధరణకు అనుమతి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడు బంగ్లా మండల పరిధిలోని పోతులపాడు (పి.గణపురం)లో గ్రామ పంచాయతీలో 2025-26 సంవత్సరానికి సంబంధించి టోల్‌గేట్ నిర్వహించుకోవడానికి నంద్యాల డివిజనల్ పంచాయతీ అధికారి అనుమతి పునరుద్ధరించినట్లు గ్రామ పంచాయతీ ఈఓఆర్‌డి, సర్పంచు నిర్మలమ్మలు ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులో పేర్కొనబడిన మొత్తాన్ని చెల్లించి టోల్‌గేట్ నిర్వహించుకోవచ్చని తెలిపారు.

## వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



పొలం పిలుస్తుంది కార్యక్రమం దృశ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలోని తర్తూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందించారు. రైతులు పంట వేసే సమయంలో అలాగే విత్తనాలు మొలకెత్తినప్పుడు వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. అలాగే మండల కేంద్రంలో కంది పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, కందులు విక్రయించే రైతులు రైతు కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

## వ్యక్తి మృతి



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని వెలగటూరు గ్రామ రహదారిలోని జుర్రేరు వాగు వద్ద ఒక వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఎస్సై వివరాల మేరకు కోవెలకుంట్లలోని స్వామి నగర్ కాలనీకి చెందిన నల్లగట్ల చిన్న దస్తగిరి అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి తన మోటర్ సైకిల్ పై వెలగటూరుకు వెళ్లే రస్తా పక్కన పడి చనిపోయాడని తెలిపారు. బం దువుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత సం వత్సరం క్రితం నుంచి భార్య తో దూరంగా ఉండటం వల్ల అతిగా మద్యం సేవించడంతో మృతి చెందినట్లు ప్రాధమిక విచారణలో తేలిం దన్నారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మందులను పంపిణీ చేస్తున్న సర్పంచు, వైద్యాధికారి

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోవెలకుంట్ల పశు వైద్యాధికారి డా.కృష్ణ కుమార్, కలుగొట్ల వైద్యాధికారిణి డా.విజయలక్ష్మిలు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పొట్టిపాడు, ఒళ్లంపాడు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలలో వివిధ రకాల పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు తమ పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎలాంటి వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పాడి గేదెలు పాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఒళ్లంపాడు సర్పంచు జగదీశ్వర్ రెడ్డి, పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానంపై అవగాహన సదస్సు



**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్ :** రామ కృష్ణ డిగ్రీ కళాశాల లో జాతీయ విద్యా విధానంపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. 6 రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధన యొక్క ప్రాముఖ్యత, వ్యాసాల ప్రచురణ చాలా ముఖ్యమని అన్నారు. ఎన్‌ఈపీ సూత్రాలతో పాటు కథనాలను ఏలా ప్రచురించాలనే దానిపై వివరించారు. పరిశోధన ఎంత ముఖ్యమో లెక్చరర్ వ్యక్తిత్వ వికాశానికి అది చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణా డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిశోధన, సాహిత్య సమీక్ష రకాల గురించి వివరించారు. అనంతరం పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి హేమంత్‌రెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

## జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడి కుటుంబానికి 5లక్షల పరిహారం



చెక్కును అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

**బనగానపల్లె,మేజర్, న్యూస్‌:** బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు మన్నెల సురేష్ ప్రమాదవశాత్తు మరణించడంతో విషయం తెలుసుకున్న బనగానపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు భాస్కర్ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పార్టీ తరపున ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పి పార్టీ దృష్టికి తీసుకెళ్లగా జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాన్ ఏర్పాటు చేసిన ప్రమాద భీమా నుండి సురేష్ తల్లి మన్నెల సువర్ణకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా రూ.5లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ సురేష్, బనగానపల్లె పి.ఒసి సురేష్ బాబు, నియోజకవర్గ నాయకులు పృథ్వీ, పెద్దయ్య, అజిత్ రెడ్డి, జనార్ధన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆదేశాల మేరకు పార్టీకి వీర విధేయులు ఉంటాం



**చిప్పగిరి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చిప్పగిరిలో ఎమ్మెల్యే విరుపాక్షి క్యాంపు కార్యాలయంలో వైసీపీ అనుబంధ విభాగాలకు పలువురు నాయకులను ఎన్నుకున్న సందర్భంగా వారు ఎమ్మెల్యే విరుపాక్షికి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువా కప్పి పూలమాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చిప్పగిరిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసిపి వింగ్ సభ్యులుగా ఎంపికయిన బసవరాజు,శ్రీనివాసులు, గిరి,లోకనాథ్,అశోక్, గోవ ర్ధన్, దత్తా రెడ్డి,మసాల ప్రకాష్,ఓబులేసు, ఈరన్న, చంద్ర లు వైఎస్సార్సీపీ చెం దిన ఆయా విభాగాలకు అధ్యక్షులుగా, సభ్యులు గా ఎంపిక చేసిన ఎమ్మెల్యే విరుపాక్షికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే విరుపాక్షి మా మీద నమ్మకం ఉంచి మాకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని వచ్చే ఎన్నికల్లో వైయస్సార్సీపి జెండాను ఎగురువేస్తామని పార్టీలో పదవులు శాశ్వతం కాదుపార్టీ శాశ్వతం అన్నారు. 2029లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామని అనుబంధ సంఘాల అధ్యక్షులు తెలిపా రు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో ఎవరు గొప్పవాళ్ళు కాదని నాతో సహా అందరూ కార్యకర్తలే అని నేను కూడా కార్యకర్త స్థాయి నుంచి వచ్చిన వాడిని అని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యం పట్ల పాడిరైతులు శ్రద్ధ చూపాలి



**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** పాడి రైతులు పశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని పశు వైద్యాధికారి నాగశైలజ, శ్రీ లక్ష్మి పేర్కొ న్నారు. మండలంలోని ఆర్ పాంపల్లె, పడిగపాడు గ్రామాల్లో మం గళవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో 42 పశువులకు సాదారణ చికిత్సలు, 275 జీవాలకు వ్యాక్సినేషన్, 405 జీవాలకు డీవార్మింగ్ చేశారు. అనం తరం పశువులకు అవసరమైన మందులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కూడాల నారాయణరెడ్డి, మమాబూబ్‌సా, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# 20 సూత్రాల పథకాల అమలును పటిష్టంగా నిర్వహించాలి




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల అమలు కార్యక్రమ చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి

- లక్ష్యసాధనలో వందశాతం ఫలితాలు సాధించాలి
- చైర్మన్ లంకా దినకర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్య సాధన దిశగా కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పటిష్టంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 20సూత్రాల ఫార్ములా కమిటీ చైర్మన్ లంకా దినకర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో 20సూత్రాల కార్యక్రమాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులతో చైర్మన్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, సీపీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దినకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై జిల్లా అధికారులు సమన్వయంతో పటిష్టంగా అమలుచేసి స్వర్ణాంధ్ర -2047 లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు నిర్లక్ష్యం చేసి సరిగ్గా పనిచేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అధిక భారం పడిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వికసిత్ నంద్యాల జిల్లాగా రూపుదిద్దేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.113కోట్లకు గాను రూ.92కోట్లు ఖర్చుపెట్టారని ఇంకా రూ.21కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని నిధులు మురిగిపోకుండా ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలన్నారు. గత ఐదేళ్ళల్లో మెటీరియల్ కాంపోనెంట్ వ్యయంలో తేడాలు ఉన్నందున విచారణ చేయాల్సిందిగా చైర్మన్ జిల్లా కలెక్టర్‌ను సూచించారు. ఉపాధి వేతనదారుల కూలీ రూ.300లు అయితే జిల్లాలో సగటున రూ.246లు మాత్రమే ఉందని దినసరి సరాసరి రేటును పెంచేందుకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద బోర్లపై ఆధారపడకుండా దీర్ఘకాలికంగా నీటి వనరుల లభ్యత ఉందో దాని ఆధారంగా జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నారు. రూ.400కోట్లతో 1568 పనులు ప్రారంభించగా అందులో 1203 పనులు రద్దు చేసిందన్నారు. చేపట్టిన పనుల నాణ్యతపై పరిశీలించాలని చైర్మన్ సూచించారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద గ్రామాల లో రహదారి నిర్మాణాల పనులు వేగంగా జరగాలన్నారు. స్వయం సహాయక బృందాల మహిళలను లక్షాధికారులు గా చేయాలన్న లక్ష్యంతో లక్‌పతి దీదిస్ పథకంలో భాగంగా జిల్లాలో 86,799మందిని లక్షాధికారులుగా మార్చేటువంటి కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన సంబంధించి 46,626 గృహాలు మంజూరు కాగా ఇప్పటికీ 27,126ఇళ్లు పూర్తయ్యాయని, పూర్తి చేసిన కాలనీల్లో జీవనానికి అవసరమయ్యేలాగా విద్యుత్, నీరు, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం ఏవై గ్రామీణ ప్రాంతాలలో 12,689 గృహాలకు గాను 2,822పూర్తయ్యాయని, 11,680 టిడ్కో గృహాలకు గాను పూర్తయిన 5వేల గృహాలను లబ్ధిదారులు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను ప్రభుత్వానికి నివేదించి పనులు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సరఫరా కోసం అమృత్-1 కింద రూ.158కోట్ల అంచనాలతో కేటాయించిన 98పనులకు గాను రూ.144కోట్లు ఖర్చు చేశారని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అమృత్-2 కింద మంజూరైన నిధులను సద్వినియోగపరిచి గతంలో పూర్తికాని పనులను కూడా పూర్తి చేయాలన్నారు. నంద్యాల పట్టణంలో 72,000 గృహాలకు గాను 69వేల గృహాలు కొళాయి కనెక్షన్లు ఉన్నాయని మిగిలిన వాటికి కూడా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డోన్ మున్సిపాలిటీలో అమృత్-2 ద్వారా నీటి సరఫరా కోసం రూ.23.56కోట్లు, బేతంచెర్ల లో రూ.45కోట్లు కేటాయించారని పనులు వేగవంతం చేసి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం అమలులో వేగాన్ని పెంచడంతో పాటు స్వయం సహాయక బృందాల సభ్యులతో అనుసంధానం చేసి గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈపథకం కింద ఇప్పటి వరకు 82,414 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్నారు. పీఎం కుసుం ద్వారా నాణ్యమైన, నిరంతరాయ వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం ప్రవేశపెట్టిన పథకంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద గత ఐదేళ్ళల్లో నష్టపోయిన రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందలేదన్నారు. ప్రతి యూరియా బ్యాగ్‌పై రూ.2వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో సంవత్సరానికి లక్ష మెట్రిక్ టన్నుల యూరియాపైన సబ్సిడీ అందుతోందన్నారు. నంద్యాల జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలను పర్యాటక రంగానికి అనుసంధానం చేసి ఆధ్యాత్మిక టూరిజం సమూహంగా అభివృద్ధి చేసేందకు ప్రణాళికాలు తయారు చేయాలన్నారు. జిల్లాలోని నల్లమల అడవులలో వైల్డ్‌లైఫ్ సెంచూరీ, జంగిల్ సఫారీకి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని 11,300మంది వీధి వ్యాపారస్తులకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. పీఎం విశ్వకర్మ 18రకాల చేతివృత్తుల పనివారలకు కూడా రుణాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరును పవర్ పాయింట్ ప్రెజేంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా పరిషత్ పాపిరెడ్డి మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలంలో పనులు లేక కూలీలు వలస వెళ్తున్నారని ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగెల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యారేజ్ నిర్మిస్తే సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో సుమారు 60టీఎంసీల నీరు నిలువ ఉంచుకోవచ్చని దీంతో నంద్యాల జిల్లాతో పాటు రాయలసీమ ప్రాజెక్టులకు సాగు,తాగునీరు అందుతుందన్నారు. ఈదిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ పథకాల నిధులు దుర్వినియోగం కాకుండా నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. జిల్లాల పునర్విభజనలో నంద్యాల జిల్లాకు అన్యాయం జరిగిందని అన్ని రంగాలలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఈసమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన జిల్లా ఉన్నతాధికారులు

## సామాజిక తనిఖీ

- బహిరంగ సమావేశాలపై సమగ్ర సమాచారం ఇవ్వండి
- ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీమ్



**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న టువంటి సామాజిక తనిఖీ, సోషల్ ఆడిట్ బహిరంగ సమావేశాలపై ఆయా గ్రామాల్లోని సర్పంచులకు, ప్రముఖులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, గ్రామ ప్రజలకు సమగ్ర సమాచారం అందించి సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించాలని శిరివెళ్ల మండల ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీమ్ సోషల్ ఆడిట్ సిబ్బందికి తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సామాజిక తనిఖీలో నిర్వహించిన గ్రామ సభ గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో పలువురు గైర్హాజరయ్యారని ఎంపీపీ తెలిపారు. గత కొద్ది రోజులుగా మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ పై ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లలో ఆందోళన నెలకొని ఉందన్నారు. ఈ నెల 30న జరిగే మండల స్థాయి సామాజిక తనిఖీ బహిరంగ సమావేశానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించాలని ఎంపీపీ గుర్తు చేశారు. దీని వల్ల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు సోషల్ ఆడిట్ పై నిర్వహించే బహిరంగ సమావేశం పట్ల అవగాహన కలిగి ఉంటారని అన్నారు. గ్రామాల్లో ఏయే పనులు నిర్వహించారు, ఎంత ఖర్చు అయ్యిందనే వివరాలు తెలుస్తాయని అన్నారు. పనులలో నాణ్యత, సక్రమంగా నిధుల వినియోగం, తదితర అంశాల ప్రజా చైతన్యం అవసరమని అన్నారు.

## మైనార్టీల అభివృద్ధి కోసం తెదేపా కృషి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** స్థానిక పట్టణంలోని జామియా సిరాజుల్ అరబిక్ కళాశాలను మంగళ వారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టి కార్పోరేషన్ చైర్మెన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టిల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. తాను ఈ కళాశాలలోనే విద్యను అభ్యసించినట్లు తెలిపారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి కళాశాలకు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వ్యవహా రాల సలహాదారులు ఎంఏ మహమ్మద్ షరీఫ్, మదార్‌సా ప్రిన్సిపల్ మెహబూబ్ రెహమాన్, మైనార్టి నాయకులు మోమిన్ రసూల్, ఖలీలుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మౌలానా ముస్తాక్ అహమ్మద్

## క్రికేట్ పోటీలను ప్రారంభించిన బి.సి ఇందిరమ్మ



**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని మార్కెట్‌యార్డు నందు కీ.శే. పుల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి స్నేహితుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికేట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్థన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ హాజరై క్రికేట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. క్రీడలకు బి.సి కుటుంబం ఎప్పటికీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామి ఇచ్చారు. క్రికేట్ టోర్నమెంట్ నివాసులు రాగద్వేషాలకు అతీతంగా పోటీలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, సంగుశ్రీనివాస రెడ్డి, మాధవ రెడ్డి, హరి, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కారు బోల్తా...మహిళ మృతి



మృతి చెందిన మహిళ శ్రీలత, (ఇన్‌సెట్‌లో) మృతురాలి కుమార్తె

**ప్యాపిలి, మేజర్ న్యూస్ః** మండల పరిధిలోని పోతు దొడ్డి గ్రామ సమీపంలో ఉన్నటువంటి 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శ్రీలత(38) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై మధుసూదన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి కదిరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, మృతురాలి భర్తకు గాయాలైయ్యాయని, కుమార్తెకు స్వల్పగాయాలైన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# కమర్షియల్ కాంప్లెక్స్‌లో కళాశాల

- 2,3వ అంతస్తులలో తరగతి గదులు
- పట్టించుకోని అధికారులు




**పత్తికొండ మేజర్ న్యూస్ :** స్థానిక పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న రాఘవేంద్ర డిగ్రీ కళాశాలను కమర్షియల్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తూ, రెండు, మూడవ అంతస్తుల్లో విద్యార్థులకు తరగతి గదులు నిర్వహిస్తున్నారు. కళాశాల క్రింద హోండా మోటారు షోరూమ్, హోటల్స్, వి.వి.ఆర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో లాడ్జి, హాస్పిటల్స్, వ్యాపార సముదాయ భవనాలు చుట్టు ప్రక్కల ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లో డిగ్రీ కళాశాలకు ఏవిధంగా అధికారులు అనుమతులు ఇచ్చారో అని ప్రజల్లో ప్రశ్నార్థకంగా మిగిలింది. రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో బిఏ. బి.కాం., బిఎస్సీ, బిజెడ్ గ్రూపులలో దాదాపుగా 250మంది విద్యార్థులు చదువుతున్నారు. రాఘవేంద్ర డిగ్రీ కళాశాల యజమాన్యం హంగు, అర్భాటాలతో ప్రచారాలు చేసుకుంటూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులను తల్లిదండ్రులకు కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, మెరుగైన విద్యను అందిస్తామని నమ్మ బలికి విద్యార్థులను కళాశాలలో చేర్చుకుంటున్నారన్న అనేక ఆరోపణలు వస్తున్నాయి. కళాశాలలో సౌకర్యాలు లేకున్నా, నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను నిర్వహిస్తున్న యజమాన్యంపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :**



దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మస్తాన్‌వలి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సహాయ పరికరాలు అందివ్వకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించి దివ్యాంగులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ త్వరలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖను సందర్శించి దివ్యాంగులకు అందించే సేవలను పరిశీలిస్తానని అన్నారు.



## జనవరి 31న అధికారికంగా
# వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

- ఏపీ ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నట్లు ఏపీ ఆర్యవైశ్య కార్పోరేషన్ డైరెక్టర్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర తెలిపారు. ఎన్నికల ముందు ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరగా ఆనాడు లోకేష్, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లను ఒప్పించి మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టడం జరిగిందని అన్నారు. ఈ అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టడంతో పాటు ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పాణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మాఘశుద్ధి విధియ తిది నాడు నిర్వహించాలని ఎన్‌డీఏ ప్రభుత్వం జీవో నంబరు 181ని విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కన్యకా పరమేశ్వరి ఆత్మర్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని అన్నారు. అలాగే మ్యానిఫెస్టోలో ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. అలాగే స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితిని కల్పిస్తుందని సీఎం చంద్రబాబు తెలిపినట్లు ఆయన గుర్తు చేశారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మవారికి ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పిస్తామని చంద్రబాబు తెలిపారన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఆర్యవైశ్యులు స్వాగతిస్తున్నారని అన్నారు.

# ఎంఏ షరీఫ్‌ను సన్మానించిన ఎన్‌ఎండి ఫయాజ్



**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్, ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారులు ఎంఏ షరీఫ్ పర్యటనలో భాగంగా టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్‌ఎండి ఫయాజ్ ఆధ్వర్యంలో నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ నాయకులతో బూత్ ఇన్‌చార్జిలు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామన్నారు. వైయస్సార్‌సీపీ పాలనలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని భౌతికదాడులు చేసిన తట్టుకుని తెలుగుదేశం పార్టీకి అండగా నిలబడి పార్టీని గెలిపించారన్నారు. అనంతరం ఇమాములు, మౌజన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి..పదవులు



**హొళగుంద.మేజర్‌న్యూస్ః** టీడీపీ ప్రభుత్వ హయామంలో గ్రామాల అభివృద్ధి జరుగుతున్నాయని..కురువలతో పాటు అన్ని వర్గాల వారికి పదవులు దక్కుతున్నాయని పార్టీ తాలూక ఇన్‌చార్జీ వీరభద్రగౌడ,తనయుడు గిరిమల్లేశ్‌గౌడలపై ప్రతి పక్షలు బురదజల్లడం సరైన పద్ధతి కాదని నాయకులు మంగళవారం తెలిపారు.కురవ సంఘం నాయకుడు మాజీ జడ్పిటిసి భర్త హెబ్బటం అయ్యాళప్ప,ఎల్లార్తి డీలర్ రాము,పెద్దహ్యాట డీలర్ అడివప్ప,బిజీహళ్లి డీలర్ మారేశ్,బిజీహళ్లి స్కూల్ కమిటి ఛైర్మన్ తిప్పేశ,ముద్దటమాగి డీలర్ చాగప్ప,లింగంపల్లి డీలర్ భీమాలు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఇన్‌చార్జీ వీరభద్రగౌడ ఆధ్వర్యంలో డీలర్ షిప్‌లు,ఫీల్డ్ ఆసిస్టెంట్ పదవులను కల్పిసున్నట్లు చెప్పారు.వీరభద్రగౌడ సహకారంతో బిజీహళ్లి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు,డ్రైనేజీని గ్రామ నాయకుడు మంజునాథచారి నిర్మాణం చేశారు.మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక హత్యా,శవ రాజకీయాలు చేయడం సిగ్గు చేటు అన్నారు.వారిపై లేనిపోని ఆరోపణాలను మానుకుని అభివృద్ధికి సహకరించాలని వారు సూచించారు.

# పరస్పర సహకారంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించండి - నాగిని రవి శింగారెడ్డి



మహిళలకు రుణాలు అందజేస్తున్న నాగిని రవి శింగారెడ్డి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ నుంచి రుణాలు పొందిన వారు పరస్పర సహకారంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని, రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని శిల్పా మహిళా సహకార బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి శింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని శిల్పా సేవా సమితి కార్యాలయంలో 176 మంది మహిళలకు రూ.25.63 లక్షల రుణాలను పంపిణీ చేశారు. నాగిని రవి శింగారెడ్డి మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా నిరంతరంగా మహిళా సహకార బ్యాంక్ పేదింటి మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని అన్నారు. మహిళా సాధికారతకు చేస్తున్న సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి శిల్పా మహిళా సహకార యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారని గుర్తు చేశారు. రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించి ఆర్థికాభివృద్ధి సాధిస్తూ సంస్థను ముందుకు తీసుకెళ్ళడానికి సహకారం అందించాలని అన్నారు. ఈ సేవలను మరింత విస్తృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా, సేవా సమితి మేనేజర్ లక్ష్మినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ ప్రభుత్వంలో అన్ని నాసిరకం పనులే

- బ్రిడ్జిని పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని 30వ వార్డు సలీం నగర్ నందు గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన బ్రిడ్జి సైడ్ వాల్ కూలిపోయిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ అన్నారు. మంగళవారం బ్రిడ్జిని ఫిరోజ్ పరిశీలించారు. ఫిరోజ్ మాట్లాడుతూ 2017లో టీడీపీ ప్రభుత్వంలో బ్రిడ్జి మంజూరైందని అన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నంద్యాల నాయకులు బ్రిడ్జి నిర్మాణంలో కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకంగా నిర్మించారని అన్నారు. బ్రిడ్జి సైడ్‌వాల్ కూలే సమయంలో ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అన్నారు. ఇందుకు సంబంధించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపినట్లు ఫిరోజ్ తెలిపారు. జనసేన పార్టీ సమన్వయ కర్త సుధాకర్, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో స్వామి వార్ల కళ్యాణం



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే శ్రీ గంగా కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం దేవస్థానం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025 మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో నిర్వహించే కళ్యాణ మహోత్సవానికి అమ్మవారి తరపున దాతలుగా వ్యవహరించేందుకు కుర్ర వెంకయ్య చౌదరి, జయలక్ష్మి దంపతులు ఆసక్తి చూపారని అన్నారు. మహానంది క్షేత్ర మాజీ పర్యవేక్షకులు సీతారత్నకుమారి, వారి కుమారుడైన ఇతను ఆసక్తి చూపి తమ కుమారులైన హేమంత్ చౌదరి, శ్రీవాత్సవ్ పేర్లపై రూ.1.50 లక్షలను దేవస్థానం ఖాతాకు జమ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది కళ్యాణ మహోత్సవానికి కళ్యాణ పెద్దలుగా వారు సేవలు అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర్ అవధాని, అర్చకులు రాజా రత్తయ్య బాబు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి తొక్కిసలాటలో గాయపడ్డ వెంకటల కి రెండు లక్షల చెక్ అందజేత



బాధితురాలికి చెక్కును అందిస్తున్న మంత్రి టి.జి.భరత్,వీరభద్ర గౌడ్

**ఆలూరు, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిస లాటలో ఆలూరుకు చెందిన వెంకటలక్ష్మి స్వల్పంగా గాయపడడంతో టిటిడి సభ్యుడు మల్లెల రాజశేఖర్, మంత్రి టి.జి.భరత్, వీరభద్ర గౌడ్ చేతుల మీదుగా భాదితురాలికి టిటిడి పంపిన చెక్కును అందించారు. మంగళవారం కర్నూల్ లో మంత్రి క్యాంపు కార్యాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏకాదశి సందర్భంగా జరిగిన తొక్కిస లాటలో ఆరు మంది ప్రాణాలు కోల్పోగా చాలా మంది గాయపడ్డారు. అందులో ఆలూరుకు చెందిన వెంకటలక్ష్మి గాయపడడంతో టిటిడి దేవస్థానం వారికి రెండు లక్షల చెక్ ను అందించారు.

### నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా

## పి.విజయకుమార్ ప్రమాణస్వీకారం



**కర్నూలు రూరల్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కర్నూలు జిల్లా పాలకవీటి విజయకుమార్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ వెల్ఫేర్ ఆఫీస్ ఉమాదేవి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్ర కోటి సదాశివం, టీటీడీ బోర్డు మెంబర్ శాంతి రామ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణులకు సంక్షిప్తాను కల్పిస్తుందని గతంలో కూడా తెలుగుదేశం పార్టీ ఆదరణ పథకం కింద నాయి బ్రాహ్మణులకు పనిముట్లు అందజేసిందని దేవస్థానంలో కూడా దేవస్థానం బోర్డు నెంబర్లుగా కూడా తెలుగుదేశం పార్టీ స్థానం కల్పించిందని కళ్యాణ కట్టల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు 25వేల వేతనమును తెలుగుదేశం పార్టీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు నాయి బ్రాహ్మణ అండ తెలుగుదేశం పార్టీని విజయకుమార్ మాట్లాడారు.

## చిరు వ్యాపారులను శక్తివంతం చేసేందుకే..!

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్ :** దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి చిరు వ్యాపారులను ఈ-కామర్స్ ద్వారా శక్తివంతం చేసేందుకే అమెజాన్ ప్రధాన లక్ష్యమని అమెజాన్ ఇండియా సెల్లింగ్ పార్ట్నర్ సర్వీసెస్ డైరెక్టర్ అమిత్ నందా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ది ఖోగే తో బి ఖోగె ప్రచారాన్ని ప్రారంభించినది తెలపడానికి తమకేంతో గర్వంగా ఉందన్నారు. ఒక కొత్త బ్రాండ్ ప్రచారాన్నీ ప్రారంభించింది. ఇందులో మూడు సృజనాత్మక, హాస్య భరితమైన వాణిజ్య భరితమైన ప్రకటనలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కటి విక్రతలు తమ ఉత్పత్తులను ప్రోత్సహించడానికి.. విక్రయించడానికి అసాధారణ మార్గాలు తీసుకునే విభిన్న దృశ్యాన్ని చూపుతూ వాటి ప్రయోజనాలను హైలెట్ చేస్తుందన్నారు. అమెజాన్ ది ఖోగే తో బి ఖోగె ప్రచారం ఇప్పటివరకు అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టులలో ఒకటి అని ఎన్మొరస్ బ్రాండ్స్ ఎల్పీపీ మేనేజింగ్ పార్ట్నర్ ఆసిస్ కజాంచి అన్నారు. చిరు వ్యాపారులు మరింత సమాచారం కోసం, వ్యక్తీతలుగా నమోదు కోసం https://sell.amazon.inని సంప్రదించాలి సూచించారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపిడిఓ, మాజీ ఎంపిపి

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా, ఉత్తమ ఉద్యోగులుగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాష చేతులమీదుగా అవార్డులు మండల కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య, మండిగిరి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌లను మంగళవారం ఎంపిపి భవన్‌లో పూలమాలలు, శాలువలతో ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపిపి పొంపాపతిలు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విధుల్లో పోటీ తత్వం ఉండాలని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తోటి ఉద్యోగులతో విధుల్లో పోటీ పడి పనిచేస్తే ఆవార్డులు తప్పకుండా వస్తాయన్నారు. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు రావడం ఎంతో హర్షించ దగ్గ విషయమన్నారు.

## కారు బోల్తా....మహిళ మృతి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:**

మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలో ఉన్నటువంటి 44వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శ్రీలత(38) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై మధుసూదన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి కదిరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని, మృతురాలి భర్తకు గాయాలైయ్యాయని, కుమార్తెకు స్వల్పగాయాలైన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన బాధితులు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మంగళవారం తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను బాధితులకు అందజేశారు. ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన మల్లు రమాదేవికి 97,000, సిరివెళ్ల మండలం వనికిందిన్నె గ్రామానికి చెందిన తోకల మాధవికి 40 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధ్యత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన ట్రాన్స్కో ఏ ఈ లు :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మంగళవారం ఆమె కార్యాలయంలో నూతన ఏఈలు మర్యాదపూర్వకంగా కలిశారు. రుద్రవరం ట్రాన్స్కో ఏ ఈ సునీల్ కుమార్, సిరివెళ్ల ట్రాన్స్కో ఏఈ నాగార్జున లు ఏడిఈ రవికాంత్‌తో కలిసి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను, టిడిపి నాయకులు భార్గవ్ రామ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎమ్మెల్యేను కలిసిన నూతన ఏఈలు

## ఉన్నత ప్రమాణాలతో ఉర్దూ యూనివర్సిటీ

(మొదటిపేజి తరువాయి..)



మాట్లాడుతున్న ఏపి సలహాదారుడు మహమ్మద్ షరీఫ్

విద్యార్థులు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సలహాదారులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వంలో యూనివర్సిటీకి ఓర్వకల్లు లో144 ఎకరాల స్థలము కేటాయించి నిర్మాణాల నిమిత్తం విధులు కేటాయించి పనులు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. గత ఐదు సంవత్సరాల్లో నిధులు విడుదల చేయకపోవడం వల్ల పనులు ఆగిపోయాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సొంత భవనంలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. విద్యారంగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని అనుసంధానం చేస్తూ ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ నందు విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. లైబ్రరీలో పుస్తకాలు పెంచాలని, క్యాంటీన్, పూర్తిస్థాయి హాస్టల్ వసతులు, సైన్స్ ల్యాబ్ మరియు కంప్యూటర్స్ లాంటి సమస్యలు తెలియజేశారు. విద్యార్థుల సమస్యలకు వైస్ ఛాన్స్ లర్ షావలి ఖాన్ సమాధానమిస్తూ ఈ ప్రైవేటు బాడుగ భవనం లో విద్యార్థుల కొరకు ఏడు గదుల ను హాస్టల్ వసతిగా ఏర్పాటు చేశామని, ఒక గదిని క్యాంటీన్ గా మార్చామని, దాతల సహాయంతో లైబ్రరీ కి అవసరమైనవి ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కి చాలా తక్కువ వేతనాలు తీసుకునే వారికి దాదాపు రెండింతలు వేతనాలు వచ్చేలాగా ప్రస్తుత ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుమరియు విద్యాశాఖ మంత్రి సహాయంతో చేయించగలిగామని తెలిపారు. ఇప్పుడు ఉన్న సిబ్బందిని శాశ్వత సిబ్బందిగా చేయటానికి ప్రభుత్వము చర్యలు మరియు యూనివర్సిటీ అభివృద్ధి కొరకు తీసుకున్న చర్యలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప తెలియజేశారు. పాణ్యం శాసన సభ్యులు గౌరుచరిత రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలో ముస్లిం మైనారిటీ జనాభా ఎక్కువగా ఉన్నందున ఇక్కడ డాక్టర్ అబ్దుల్ హాక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. హాస్టల్, యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి 2016 మే నెలలో ముఖ్యమంత్రిలు నారా చంద్రబాబునాయుడు రూ 18 కోట్లు మంజూరు చేశారని, అందులో ఒక కోటి రూపాయలు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తఫా మౌలానా అహమ్మద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రచారానికి మాత్రమే ఉర్దూ యూనివర్సిటీని వాడుకున్నదని, ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వము అన్ని చర్యలు తీసుకొని ఉన్నతమైన ఉర్దూ యూనివర్సిటీని తయారు అవుతుందని అన్నారు.

## వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలి



వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిని మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్న వాటికి క్షేత్రసాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి నాలా యాక్టు ప్రకారం ఐదు శాతం రుసుం చెల్లించి ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ గుండాల నాయక్, విఆర్ఓ రాజశేఖర్ గౌడ్, విలేజ్ సర్వేయరు ఆసీఫ్, అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు 30 కుటుంబాలు టీడీపీలో చేరిక

### - పార్టీలోకి ఆహ్వానించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి



**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ముఖ్య అనుచరులు వాల్మీకి సోదరులు కర్రెన్న, భీమన్న, ఆంజనేయ, హనుమంతు, రాముడు,దుల్లయ్య, పూలరాముడు, ఆలీ బాష, వీరేష్, హరి, రాజశేఖర్, రామలింగయ్యతోపాటు దాదాపు 30కుటుంబాలు బీసీసెల్ నియోజకవర్గం అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్యాలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రాలయం మండల కన్వీనర్ పన్నాగ వెంకటేష్ స్వామిలు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులైనట్లు తెలిపారు. కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి కార్యకర్తలకు అండగా నిలిచిన తీరును చూసి టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. తిక్కారెడ్డి నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, పవన్ కుమార్, వడ్డేప్ప నరసింహులు, సాయి కుమార్, సల్మాన్ రాజు, ఏబు, సుంకప్ప, లక్ష్మన్న, నారాయణ, నర్సారెడ్డి, నరసింహులు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి ప్రయాణిస్తే చర్యలు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :**

ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకుని ప్రయాణం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోవెలకుంట్ల లోని ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అధిక లోడ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని ఎవరైనా అతిక్రమిస్తే అలాంటి వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించాలని అలాగే లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఇన్స్యూరెన్స్ కలిగి ఉండాలని అన్నారు.

# గురుకుల బాలుర కిడ్నాప్ కలకలంలో పాఠశాల సిబ్బంది వైఫల్యం -డిసిఓ.శ్రీదేవి

**-కంపౌండ్ లేదన్న సాకు చూపే ప్రయత్నం చేసిన పాఠశాల సిబ్బంది..**
**-మైండ్ గేమ్ తో తపించుకునే ప్రయత్నం చేసిన బాలురు**
**-కాంపౌండ్ లేకపోవడం వల్ల పిల్లలకు ఇష్ట రాజ్యం**
**-పోలీసుల అలర్ట్ తో కిడ్నాప్ కలకలంకు ముగింపు**
**-పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం డిసిఓ. శ్రీదేవి వ్యక్తం**


రికార్డులను పరిశీలిస్తున్న డిసిఓ. శ్రీదేవి

**సి. బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం విద్యార్థుల కిడ్నాప్ కలకలం నంచలనంగా మారిన సంగతి తెలిసిందే. అందులో బాంగంగా గురుకుల పాఠశాలల జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు. మంగళవా రం స్థానిక గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల రాకపోకలు రిజిస్టార్, అటెండెన్స్, గేట్ పాస్ వంటి వాటిని పరిశీలి ంచారు. అనంతరం తప్పించుకున్న బాలుర గురించి ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను గమనించిన డిసిఓ పాఠశాల సిబ్బంది వైప ల్యం స్పష్టంగా కనిపించిందని భోజన సమయంలో అటెండెన్స్ను కోవడంలో పీడీ,పిఇటీల నిర్లక్ష్యం వల్లే ఇటువంటి తప్పిదాలు చోటు చేసుకుంటాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుర మిస్సింగ్ లో సెక్యూరీటీ తప్పిదమే అని చెప్పే ప్రయత్నం చేయగా ఇది అందరి వైపల్యం అని ఆగ్రహం వ్యక్తం చేశారు మునుముందు ఇలాంటి పునరుతానం కాకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పాండు రంగన్న తో మాట్లాడిన డిసిఓ పాఠశాల కు కంపౌండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిసిఓ శ్రీదేవి, ఎంఈఓ -2 ఆదమ్ బాష, సర్పంచ్ పాండు రంగన్న పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, వైస్ ప్రిన్సిపాల్ విజయుడు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అన్ని గ్రామాలను స్వచ్ఛమైన, బహిరంగ మల విసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుటకు పంచాయతి రాజ్, ఆర్డబ్ల్యూ ఎస్, డ్వామా శాఖలు సమిష్టిగా కృషి చేయాలని పంచాయతి రాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ సూచించారు. మంగళవారం ఆయన జడ్పీ సీఈవో, డిపిఓ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సి, ఈఈ, డ్వామా, మండల స్థాయి అధికారులైన ఎంపీడీఓలు మరియు ఏఈ, ఆర్డబ్ల్యూఎస్, ఒడిఎఫ్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి సర్వే చేయించాలని అవసరమైన, స్థలం ఉన్న ఇంటికి వ్యక్తిగత మరు


సమావేశంలో పాల్గొన్న జడ్పీ సీఈవో తదితరులు

గుదొడ్లు , కంపోస్ట్ పిట్, కిచెన్ గార్డెన్ ల ఏర్పాటుకు సూచనలు జారీ చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ల ద్వారా సర్వే చేయించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతలు మరియు సామాజిక (కమ్యూనిటీ సోక్ పిట్ లను, కనీసం 2000 జనాభా కలిగిన గ్రామానికి 3 చొప్పున ఏర్పటు చేయుటకు ఆర్.డబ్ల్యూ ఎస్ శాఖ వారికీ ఆదేశాలు జారిచేశారు.కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు ప్రతి గ్రామ పంచాయితిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దశల వారిగా రాష్ట్రంలో ఒడిఎఫ్ గ్రామాలుగా మార్చేందుకు చేయాలని కోరారు. సమావేశంలో అర్బులు జెడ్పీ సీఈఓ జి నరసరావు రెడ్డి, ఆర్డబ్ల్యూ ఎస్ఎస్సి నాగేశ్వరరావు, డి ఈ అమల, డి ఎల్ పి ఓ మంజులవాని తదితరులు పాల్గొన్నారు.

# ఓవర్ బ్రిడ్జి హైట్ పెంచుతారా..?

**పాములపాడు, మేజర్ న్యూస్ :** ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కర్నూలు విజయవాడ జాతీయ రహదారి 340సి చాలా స్పీడుగా పనులు జరుగుతున్నాయి. అయితే గ్రామాలలో సర్వీస్ రోడ్లు నిర్మించకుండానే పనులు చేపడుతుంటే ఆయా గ్రామాల రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా కొన్ని ప్రదేశాలలో అండర్ పాస్ నిర్మాణాలు చిన్నవిగా జరుగుతున్నాయని పాములపాడు మండల కేంద్రంలోని రైతులు చెలిమిళ్ళ లింగాల గ్రామాల ప్రజలు అండర్ పాస్ వంతెన చిన్నది నిర్మిస్తున్నారని అడ్డు చెబుతున్నారు. ఈ వంతెన నిర్మాణం తక్కువ హైట్ తో నిర్మిస్తున్నాడంతో భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు అవుతాయని సర్వీస్ రోడ్డు కూడా ఏర్పాటు చేయకుండా అండర్ పాస్ నిర్మాణం జరుగుతుండడం పై పాములపాడు అధికార ప్రతిపక్ష నాయకులు ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాములపాడు మండల కేంద్రం నుండి చెల్లిమిళ్ళ గ్రామానికి వెళ్లే దారిలో ఈ అండర్ పాస్ వంతెన నిర్మిస్తున్నారు. 25 మీటర్ల పొడవు 7 మీటర్ల వెడల్పు మరో వైపు ఏడు మీటర్ల వెడల్పు మరోవైపు 6 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్నట్లు అంచనా ఎత్తు విషయంలో చిన్నగా ఉందని భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని పాములపాడు నుండి లింగాల చెలిమిళ్ళ తో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు సప్త నగదువుల సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రం, వెళ్లాలంటే ఈ దారిలోనే భక్తులు యాత్రికులు వెళ్లాల్సి ఉంటుంది కేవలం 6 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే కోత మిషన్లు కంటైనర్లు భారీ వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి అయితే వంతల నిర్మాణంలో ఎలాంటి మార్పులు ఉండవు అని నిర్మాణం చేపడుతున్న పీఎస్ కే కాంట్రాక్టర్ చెబుతున్నారు అయితే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనిప్రజాసంఘాలనాయకులు,కాంట్రాక్టర్లనుప్రశ్నిస్తున్నారు. సమస్య ఇలాగేఉంటే హైవే నిర్మాణం పనులను అడ్డుకుంటామం టున్నారు. కంబాలపల్లి గ్రామంలో ఇదే పరిస్థితి ఇక్కడ కూడా సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణం చేపడుతున్నారు కంబలపల్లె నుంచి ఇస్కాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి శ్రీశైలానికి ముఖ ద్వారమైన నందీశ్వరాలయం ఇక్కడే ఉంది ఉగాది శివరాత్రి సమయాలలో భక్తులు రద్దీ ఎక్కువగా ఉంటుంది పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు ఇక్కడ సర్వీస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు అయితే ఈ సమస్య నేషనల్ హైవే పిడి,జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లామని నాయకులు చెబుతున్నారు అందుకొరకే నిర్మాణం పనులు అడ్డుకుంటున్నామని సమస్యను త్వరగా వారు కోరుతున్నారు.



**చిన్న అండర్ పాస్ వంతెనతో ఇబ్బందులు ..కోట్ల చంద్రారెడ్డి సర్పంచ్ చెలిమిల్ల గ్రామం పాములపాడు :** చెలిమిళ్ళ రహదారిలో నిర్మిస్తున్న వంతెన పూర్తి చిన్నదిగా కనిపిస్తుంది నిత్యం వాహనాలు రద్దీగా ఉండే రహదారిలో ఇంత చిన్న బ్రిడ్జి నిర్మాణం తో రైతులు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు బ్రిడ్జి నిర్మాణం ఎత్తును పెంచాలి లేకపోతే సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.



**భారీ వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు.. బాల మల్లేశ్వర రెడ్డి సర్పంచ్ లింగాల గ్రామం పాములపాడు :** ప్రస్తుతం ఎన్హెచ్ 340సి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న అండర్ పాస్ వంతెన ఇంత చిన్నదిగా ఎందుకు నిర్మాణం చేపడుతున్నారు అర్థం కావడం లేదు కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం కొలనుభారతి క్షేత్రాలకు నిత్యం వాహనాలు తిరుగుతూనే ఉంటాయి కనీసం సర్వీస్ రోడ్డు వేయకుండా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు.



**జిల్లా కలెక్టర్ కు నేషనల్ హైవే పిడి కి ఇదివరకే వినతి పత్రాలు అందించాం..ముర్తుజావలి కోఅప్టేట్ మెంబర్ పాములపాడు :** పాములపాడులో నిర్మిస్తున్న వంతెన చిన్నదిగా నిర్మిస్తున్నారని రెండు నెలల క్రితమే జిల్లా కలెక్టర్ కు నేషనల్ హైవే పిడికి వినతి పత్రం అందించాము పిడికి ఫోన్ చేసి మా సమస్య ఏమైంది మేడమ్ అని అడగగా మీ ఒక్కరి కోసం సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయలేం అని సమాధానం ఇచ్చారు.



**వంతెన నిర్మాణం పున:పరిశీలించాలి..రాము జనసేన నాయకులు నందికొట్కూరు నియోజ కవర్గం:** ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని అలాగే బస్సు సెంటర్ కూడా ఇక్కడే నిర్మించాలని సర్వీస్ రోడ్ నిర్మించకుంటే తహసిల్దార్ కార్యాలయానికి జూనియర్ కళాశాలకు గ్రామ సచివాలయం కూడా దృష్టిలో ఉంచుకొని సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి.

# న్యాయ సహాయ తనిఖీ కేంద్రం తనిఖీ


మాట్లాడుతున్న న్యాయమూర్తి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని ఉపకారగారంలోని కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శి బి.లీల వెంకట శేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప కారగారంలో ఉన్న నిందితులతోఆయన మాట్లాడారు. న్యాయ సహాయ కేంద్రం ఉచితంగా న్యాయ సలహాలను అంది స్తుందని ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదినిఏర్పాటు చేస్తుందన్నారు. నిందితుల కేసులకు సంబంధించి వాయిదా వివరాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిందితులు అందరికీ న్యాయవాదులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏదేని సమస్యలు ఉంటే ఆన్లైన్ నెంబర్ 15100 ద్వారా సేవలను అభ్యర్థించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సహా య కేంద్రం న్యాయవాది షాహినా బేగం, ఇన్చార్జి ఉపకారాగార అధికారి సుబ్బయ్య, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే.. క్రీడాయి కార్యదర్శి బ్రిజేష్ సింగ్



**కర్నూలు స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అవుట్డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ వుడ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా క్రీడాయి కార్యదర్శి బ్రిజేష్ సింగ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని అనంతరం వారిని ఉద్దేశించే ప్రసంగిస్తూ ఈ ఆధునిక యుగంలో చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ప్రతిభగల పేద క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధమేనని కార్యదర్శి బ్రీజేష్ సింగ్ తెలిపారు. జిల్లా కి కొత్త క్రీడను పరిచయం చేసి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న కార్యదర్శి ప్రభాకర్ నీ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన ప్రశాంత్ ని కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వుడ్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, తమిళనాడు ఫుడ్ బాల్ కార్యదర్శి ప్రశాంత్, తెలంగాణ కార్యదర్శి ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహా ప్రతిష్ఠకు రూ.25 వేలు విరాళం


25 వేలు అందిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి,

**ఆలూరు,మేజర్ న్యూస్ :** ఆలూరు మండలంలోని కురుకుంద గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నూతన విగ్రహా ప్రతిష్ఠ మహెూత్సవానికి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి నిర్వహకులకు 25 వేల రూపాయలను విరాళంగా అందించారు. మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరిలో ఎమ్మెల్యే నివాసంలో కురుకుంద గ్రామ ప్రజలు,భక్తులు గ్రామంలో నూతన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయడానికి తలంచి ఎమ్మెల్యే విరుపాక్షి ని సహాయం కోరగా అడిగిన వెంటనే వారికి 25 వేల రూపాయలు విరాళం అందించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.కార్యక్రమంలో గ్రామస్థులు,వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# కంది పంట విక్రయాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి




**ఓర్వకల్లు,మేజర్ న్యూస్ :** కంది పంట విక్రయాలకు రైతులు రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ అన్నారు. ఖరీఫ్ సీజన్ లో రైతు లు వేసిన కంది పంటను ప్రభుత్వం మార్క్ఫెడ్ మరియు నాఫెడ్ ద్వారా ఓర్వకల్లు సొసైటీ లో కొనుగోలు చేస్తారని క్వింటాలకు 7550 మద్దతు ద్వారా లభిస్తుందని తెలిపారు. అనం తరం మంగళవారం మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శనగ పంటను వ్యవసాయ అధికారులు సందర్శించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, వీఏఏ అమీర్ ఖాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు పిహెచ్సి ని తనిఖీ చేసిన డిఎంహెచ్వో

**కల్లూరు మేజర్ న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి .శాంతికళ కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించి రికార్డ్స్ రిపోర్ట్స్ ను తనిఖీ చేశారు , జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి తక్కువగా ఉన్నదని 100% పూర్తి చేయాలని ఆదేశించారు ల్యాబ్ ను తనిఖీ చేశారు. ఎం.ఎల్.హెచ్.పి లు ఆరోగ్య కార్యకర్తలకు సమావేశం నిర్వహించి వారితో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆ వివరాలను సంబందిత రిజిస్టర్ మరియు పోర్టల్ నందు నమోదు చేయాలని అన్నారు ఆరోగ్య కార్యక్రమాలపై ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా అమ్మాయిలకు 18 సంవత్సరాలు , అబ్బాయిలకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తరువాత మాత్రమే వివాహాలు జరుగునట్లు చూడాలని , మూడు సంవత్సరములు తాత్కాలికంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు వాడాలని ఆ తరువాతనే తల్లికి అవసరమైన శరీర ఆకృతిని కలిగి ఉంటారని మరియు గర్భం దాల్చడానికి సిద్ధంగా ఉంటారని ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో డి ఎం ఓ నూకరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి డాక్టర్ మోతీలాల్ నాయక్, ఆరోగ్య పర్యవేక్షకులు , ఎంఎల్ హెచ్ పి లు , ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

- తూతూ మంత్రంగా విచారణ
- విద్యార్థి సంఘం నాయకులు అడిగిన ప్రశ్నలకు పరారైన ఆర్ఐఓ గురువైయ్యా శెట్టి
- కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్య సమాధానం



## ఎస్.ఆర్ కాలేజీ క్షుద్ర పూజ
# కేసు కంచికే..!

**కర్నూలు క్రైం,మేజర్‌న్యూస్ :** నగర శివారులలోని తాండ్రపాడులో ఉన్న ఎస్.ఆర్ కాలేజీలో ఆదివారం జరిగిన క్షుద్ర పూజల కేసు అధికారులు పోలీసులు కాలేజీ యాజ మాన్యం కలిసి కంచికి సాగనంపారు. తాండ్ర పాడులో ఉన్న ఎస్.ఆర్ కాలేజీలో బైపిసి చదువుతున్న విద్యార్థినీ జుట్టు కట్ చేసి నిమ్మకాయలు పెట్టి క్షుద్ర పూజలు చేసిన సంఘటన పైన స్పందించిన విద్యార్థి సంఘాలు,ఐద్వా సంఘాల పోరాటాలు నిర్వీర్యమయ్యాయి.అధికార యంత్రాంగంలో ఉన్న ఆర్ఐఓ గురువైయ్యా శెట్టి ఎస్.ఆర్ యాజమాన్యానికి తలొగ్గి నామమాత్రంగా విచారణ జరిపి సంఘాల నాయకులు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తన సొంత కారును వదిలి ఆటోలో పారార్రైయ్యాడు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఐసిడిఎస్, సిడిపిఓ, ఆర్ఐఓ,తాలుకా పోలీసులు ఎస్.ఆర్ కాలేజీలో విచారణ చేపట్టారు. అయితే తూతూ మంత్రంగా విచారణ జరిపి జరిగిన సమాచారం సరైన విధంగా రాబట్టడంలో విఫలమై యాజమాన్యం చెప్పిన మాయమాటలను నమ్మి అక్కడి నుండి వెనుతి రిగారు. కాలేజీ జోనల్ అధికారి రఘువీర్,ప్రిన్సిపాల్ రాజు కూడా విద్యార్థి సంఘాలకు, అధికారులకు నిర్లక్ష్య సమాధానం చెప్పడమే కాకుండా కట్టుకథలు చెప్పి అక్కడి నుండి అందరిని పంపించేశారు.దీంతో పోలీసులు కూడా కాలేజీ యాజమాన్యా నికి వత్తాసు పలుకుతూ విద్యార్తినీ తన జుట్టును కత్తిరించుకొని ఉండవచ్చునని,నిమ్మకాయలు కూడా మూడు రోజుల కిందటి వని ఆమె చేతికి అయిన గాయం కూడా కత్తితో కోసినది కాదని చెప్పడం విడ్డూరంగా మారింది.గాయమైన వెంటనే కాలేజీ యాజమాన్యం ఆసుపత్రికి చికిత్స కోసం పంపించగా ఆసుపత్రి డాక్టర్లు జరిగిన దాడి ఆయుధంతో జరిగని దాడేనని ఎమ్మెల్సీ పంపించిన అలాంటి ఏమి జరగలేదని,దీనిపై తల్లిదండ్రులు కానీ విద్యార్థానీ కానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తాలుకా పోలీసులు చెప్పడం పలు అనుమాలనాలకు దారితీసుతుంది..?ఫిర్యాదు లేనప్పుడు కాలేజీలోకి పోలీసులు ఎందుకు వచ్చారని విద్యార్థి సంఘాలు,ఐద్వా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కర్నూలు నగరంలోని కొన్ని కార్పొరేట్ కళాశాలలు విద్యార్థినీ,విద్యార్థులు చనిపోయిన అఘాయిత్యాలు అయిన పోలీస్‌స్టేషన్‌లలో కేసులు కాకుండా బాధితుల తల్లిదండ్రులను తమ వైపుకు తిప్పుకొని ఎంతోకొంత డబ్బును ముట్టజెప్పి చేతులు కడుక్కోవడం పరిపాటిగా మారింది.కాలేజీ యాజమాన్యం తప్పుకొట్టొచ్చినట్లు కనపడుతుందని కొందరు అధికారులు చెప్పిన వారి మాట వినకుండా యాజమాన్యం ప్రవర్తించింది.అంత పెద్ద కాలేజీలో సిసి ఫుటేజీ కెమెరాలు లేకపోవడం ,గర్ల్స్ హాటల్‌లో ప్రిన్సిపాల్, వార్డెన్,సెక్యూరిటీ మగవారే ఉండడం బాధాకరం..ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ , మానవహక్కుల కమీషన్ కాలేజీల పై సమగ్ర విచారణకు ఆదేశించి తప్పని తెలితే..కాలేజీలను లైసున్స్‌లను తొలగించి కళాశాలను మునివేస్తే తప్పా ఇలాంటి సంఘటనలు పునారావృత్తం కాకుండా ఉంటాయని విద్యార్థి సంఘాలు,ఐద్వా సంఘాలు వాపోతున్నాయి.

విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో ..తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం వారు కష్టపడి సంపాదించి.. అప్పులు చేసు కొని తమ పిల్లల చదువుల కోసం దురవారాలకు పంపించాల్సి వచ్చిన ధైర్యం చేస్తు వారి బంగారు భవిష్యత్తే తమ జీవిత లక్ష్యమంటూ ఆలోచనలతో తమ పిల్లలను చదివిస్తుంటే చదువులు చెప్పాల్సిన కళాశాలలు మాత్రం తమ సంపాదనను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల పట్ల కళాశాల హాస్టళ్లల లో తీసుకోవాల్సి జాగ్రత్తలను తీసుకోకుండా వారికి సరైన ఆహారం ఇవ్వకుండా..వారి పై దృష్టి సారించకుండా చేస్తే ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు ఏ విధంగా ధైర్యం చేసి వారి పిల్లలను చదువుల కోసం పంపిస్తారు అన్నది ప్రశ్నార్ధకంగా మారింది.కళాశాలలు మాత్రం చదువును వ్యాపారంగా చేసుకొని తమ సంపాదనను మాత్రమే అర్జిస్తూ..ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు తాము తప్పించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరింపులకు పాల్పడుతూ.. వారికి డబ్బు ఆశను చూపిస్తూ..ఇలాంటి విషయాలు బయటకు పొక్కుతే మీ పిల్లల భవిష్యత్తు చెడిపోతుందని వారికి నచ్చజెబుతూ తప్పించుకుంటుంటే అన్యాయం జరిగిన విద్యార్థులకు ఎలా న్యాయం జరుగుతుందని దీని ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు చర్చించుకుంటున్నారు.



పనులు వన్‌సైడ్ చేస్తే..

# అధికారులపై వార్

- ప్రజలకు సేవచేయండి - నాయకులకు కాదు..
- ప్రతి పథకం పేదవారికే అందాలి - ఇష్టానుసారంగా చేస్తే చూస్తూ ఊరుకోం - ఎమ్మెల్యే బాలనాగరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగరెడ్డి

**కోసిగి మేజర్ న్యూస్ :** వైకాపా పార్టీ వాడు మావాడుకాదు.. మేము చెప్పినవాళ్ళకే పనులు చేయాలి.. అంటూ రాజకీయ నాయకుల సహకారంతో పనులను వన్‌సైడ్ చేస్తే ఆ అధికారులపై వార్ తప్పదని ఎమ్మెల్యే బాలనాగరెడ్డి అధికారులకు హెచ్చరించారు. మంగళవారం కోసిగిలో జరిగిన సర్వసభ్య సమావేశంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశం ఎంపిపి లవకుశ ఈరన్న అధ్యక్షతన చేపట్టారు. అన్ని శాఖ అధికారుల పనితీరు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఉపాధిహామీ పథకంలో రాజకీయ జోక్యం ఎక్కువైందని దీనివల్ల పేదకూలీలు నష్టపోతారన్నారు. రాజకీయాల వల్ల ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. అన్ని వర్గాల కూలీలు కూలీపనులు కల్పిస్తే వలసలు నివారించొచ్చు అన్నారు. ముఖ్యంగా అధికారులు రాజకీయం చేయకుండా పనులు చేయాలని సూచించడం జరిగింది. కోసిగి గ్రామంలో తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తాగునీరు కాకుండా ఉప్పునీరు సరఫరా చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ప్రతి పథకంలో రాజకీయం చేయకుండా పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవచేయాలన్నారు. అధికారులు వన్‌సైడ్ పనులు చేస్తే అలాంటివారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐ మంజునాథ్, యస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు చేపట్టారు. జడ్పి టిసి పవిత్రపాటిల్, మురళీరెడ్డి, నాడుగేని నరసింహులు, బెట్టన్నగౌడు, నాడుగేని నాగరాజు, మాజీ ఎంపిపి నాడుగేని భీమక్క, మాజీ జడ్పిటిసి దళవాయి మంగమ్మ, అధికారులు పాల్గొన్నారు.

## కందులు కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పత్తికొండ మేజర్ న్యూస్ :** మండలంలోని పుచ్చకాయల మాడ గ్రామంలో కందులు కొనుగోలు కేంద్రాన్ని మంగళ వారం నాయకులు సాంబశి వారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడిఏ మోహన్ విజయ్ కుమార్, ఏఓ వెంకట్ రాముడు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామా ల్లో రైతు సేవా కేంద్రాల్లో కందులు కొనుగోలుకై రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు వంటి రైతులయొక్క కందులను కొనుగోలు ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు జిల్లా మార్క్ఫెడే కర్నూలు ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తికొండ మండలంలోని డిసిఎంఎస్ ద్వారా కందులు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది ద్వారా కందులు కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇంకా సమయం ఉందని రైతులందరూ సద్వినియోగం చే సుకోవాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర 7,550/- ఒక క్వింటాల్ ధరను ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం ద్వారా కందులు పత్తికొండ డిసిఎంఎస్ వారు కొనుగోలు చేయచున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ హరితమ్మ, ఎఈఓ శ్రీనాథ్, ప్రొక్యూర్మెంట్ ఇంచార్జ్ సత్య నారాయణ, డిసిఎంఎస్ స్టాఫ్ మల్లికార్జున, రామకృష్ణ, బాబ్జిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నాడు రద్దు.. నేడు పునరుద్ధరణ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నీసా

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలో శ్రీనివాసనగర్ శ్రీనిధి హోటల్ నుంచి పద్మావతినగర్ మెయిన్ రోడ్డు వరకు 50 అడుగుల మాస్టర్ ప్లాన్ గతంలో మంజూరు చేశారు. గత ఏడాది జులై 31న కౌన్సిల్ తీర్మాణంలో రద్దు చేసిన రోడ్డును ఇప్పుడు మళ్లీ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టడం సమంజసం కాదని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ సాదారణ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి నిర్వహించారు. అజెండాలోని 24 అంశాలను చర్చించి ఆమోద ముద్ర వేశారు. జనాభా తగిన విధంగా రోడ్డు వెడల్పు చేయడం శుభ పరిణామమేనని 12వ వార్డు కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్ అన్నారు. చైర్‌పర్సన్ మాబున్నీసా మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి తగు విధంగా రద్దు చేసిన రోడ్డును పునరుద్దరణ చేయాల్సి వచ్చిందని అన్నారు. ప్రతిపాదనలు కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థకు పంపినట్లు కమీషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వివిధ రకాల పన్నులు రూ.30 కోట్లు రావాల్సి ఉందని సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# దొంగ నోట్ల కేసులో - నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష



**బండి ఆత్మకూరు రూరల్ మేజర్ న్యూస్ :** దొంగ నోట్ల కేసు వ్యవహారంలో బండి ఆత్మకూరుకు చెందిన నలుగురు వ్యక్తులకు ఏడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 2,000 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి మంగళవారం నాడు తీర్పు ఇచ్చినట్లు ఎస్పై జగన్మోహన్ తెలిపారు.ఎస్పై జగన్మోహన్ తెలిపిన వివరాలు మేరకుబండి ఆత్మకూరుకు చెందిన చంద్ర కాయల సుధాకర్, షేక్ రషీద్ బియ్యగారి కరీం దాసరి వెంకటేశ్వర్లు జమాల్ బాషా, రామ ప్రసాద్ అను ఆరుగురు యువకులు విలాసాలకు అలవాటు పడిసులభంగా డబ్బు సంపాదించాలన్న దురాశతో నకిలీ మిషను తెచ్చుకొని 100 రూపాయల నోట్లను సృష్టించారు . సృష్టించిన నోట్లతో కొన్నాళ్లపాటు జల్సాగా తిరిగారని పోలీసులు తెలిపారు. నకిలీ నోట్లతో అప్పట్లో ఉన్న వైన్ షాపులో కూడా మందులను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. నంద్యాలలోని ఒక హెూటల్లో టిఫిన్లు చేసి హెూటల్ యజమానికి బిల్లు చెల్లించడంతోపాటు టిప్పుల కింద బేరర్కు 100 రూపాయల నోట్లను ఇచ్చారు. అదే హెూటల్ కు తిరిగి మరుసటి రోజు ఇదే రీతిలో ప్రవర్తించారు. దీంతో అక్కడి హెూటల్ యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఆరుగురు యువకులలో కొంతమంది మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో నకిలీ నోట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నదీ అప్పట్లో మరో కథనంగా వినిపించింది.గతంలో ఉన్న నంద్యాల రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి సుమోటో కింద 2017 వ సంవత్సరంలో కేసును నమోదు చేశారు. ఏడేళ్ల తర్వాత కేసు విచారణ జరిగిన అనంతరం ముద్దాయిలపై పోలీసులు మోపిన కేసు రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసు లో ఇరువురు ముద్దాయిలు ఇదివరకే మృతి చెందారు. రాంప్రసాద్ అనే యువకుడు 2023 లో యాక్సిడెంట్లో మృతిచెందగా జమాల్ బాషా అనే మరో యువకుడు అనారోగ్య కారణాలవల్ల మృతి చెందడం జరిగింది. మిగతా నలుగురు ముద్దాయిలు కు ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ ఒక్కొక్కరికి 2000 రూపాయలు చొప్పున 8000 ర జరిమానా కూడా నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్పై జగన్మోహన్ తెలిపారు.